25164

# చావు యాతన

సుబ్బారావు తండ్రి చచ్చిపోయాడు. దాదాపు ఎనభై యేళ్లుంటాయి, ఒక్క వారం రోజుల బాధతో ఆయన తనువు చాలించాడు.

సుబ్బారావు ఒక్కసారి ఒంటరివాడై పోయినట్టు భయపడిపోయాడు. కాళ్ల కింద భూమి తొలిచేసినట్టయి పోయింది. ఇప్పుడిక కుటుంబానికి తానే పెద్ద.

తండ్రి పోయిన బాధ కంటే ఆ తరువాత తతంగం బాధ అతన్ని చాలా హింసించింది.

ఎంత తంతు! ఎంత ఖర్చు!!

పాతిక ముప్పయివరకు ఉత్తరాలు రాశాడు. అన్నిటి అంచునా సిరా మరకలు రాశాడు.

చూస్తూ చూస్తూ వుండగానే చుట్టాలు దిగిపోయారు.

వగ దలుస్తున్నట్టా? వాత పెడుతున్నట్టా?

ఎందుకింత మంది జనం? వీళ్లెవరయినా పోయిన తన తండ్రిని తీసుకురాగలరా? చెల్లెలి పెళ్లిలో వీళ్ల తన తండ్రిని తిట్టిన వారు కారూ? వీళ్లందరికీ తను భోజనాలు పెట్టి మేపాలా? పైగా మర్యాదలు చూపాలా?

ఎంత బుద్ధి తక్కువ

ఎంత డబ్బు దండగ.

సుబ్బారావుకు కళ్లు మండిపోతున్నాయి. గత పదిహేను రోజుల నుంచీ నిద్రలేదు.

తల్లి మూర్ఖానికి అతనికి కోపం వచ్చింది. మళ్లీ సర్దుకున్నాడు. ఆడవాళ్లని అంత అజ్ఞానులుగా మూరులుగా తయారు చేసింది ఎవరూ?

పెద్ద కర్మ ఘనంగా జరిగింది.

మహేశ్వరులు కాక దాదాపు రెండు వందల మంది భోజనాలు చేసి వుంటారు. మహేశ్వరులకు పంచెలు. స్టీలు చెంబులు, పీటలు... పంచడం.

ఆహా.... ఎంత పకడ్బందీగా తయారు చేశారీ. సంప్రదాయాలు. ఎవరి మేలు కోరి ఈ ఏర్పాట్లు? ఎవ్వరూ ఎదిరించరే.....

శవం మీద కూడా ఇంత ఖర్చు చేయించడం ఏమిటని అడగరే?

ఏమి సంస్కృతి మనది? శవాన్ని కూడా డబ్బు చేసుకోవడానికి వాడుకునే సంస్కృతి!

కళ్లు మండిపోతున్నాయి సుబ్బారావుకి.

వళ్లు మండిపోతోంది సుబ్బారావుకి.

ఖర్చు లెక్క చూసుకుంటే పదివేలకు తేలింది.

అయింది చాలక ఇంకా మాసికాలట. సంవత్సరీకం కూడా పెద్దపెట్టున చెయ్యాలట.

ఆ తరువాత తద్దినాలు ఎలాగయినా ఫరవా లేదట.

ఎక్కడ ఏం లోపం వచ్చినా చచ్చినవాడి ఆత్మ ఘోషిస్తుందట.

సుబ్బారావు మనసు తీవ్రంగా ఘోషించింది. తండ్రి లేడన్న బాధ కంటే ఈ బాధే ఎక్కువగా వుంది. ఖర్చు ఒక్కటితో సరిపోదు. బోలెడుతంతు!

తలగొరిగించుకోవడం......

పిండం వండి కాకులకు పెట్టడం.....

తన తండ్రి చచ్చి కాకి అయ్యాడని అనుకోవడం ఎంత మాత్రం నచ్చలేదు...

ఎప్పుడో ఆటవికదశలో ఇవన్నీ చేశారంటే.. అజ్ఞానం వల్ల కావొచ్చు. కాని అణుయుగంలో, అంతరిక్ష యుగంలో , కంప్యూటర్ల యుగంలో ఇదంతా ఏమిటి?

ఆఖరికి లెక్కల్చూస్తే ఐదువేల అప్పు వెక్కిరిస్తోంది. పోయిన తండ్రి యాతన లేకుండానే పోయాడు. బతికున్న సుబ్బారావుదే చావు యాతన.

*రచన : జూలై 86.*

*ప్రచురణ : ఆంధ్రభూమి (నేటికథ) 30-9-1986.*